టీకాతో 'గాలికుంటు'కు చెక్

- అక్టోబర్ 15 వరకు అందుబాటులో వ్యాక్సినేషన్
- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశువైద్యాధికారులు



గాలికుంటు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

పెనుకొండ: టీకాతో పశువుల్లో గాలికుంటు వ్యాధి రాకుండా చూడవచ్చని పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు. ప్రాణప్రదంగా చూసుకునే పశువులను వ్యాధి నుంచి కాపాడుకోవాలని సూచిస్తున్నారు. పెనుకొండ డివిజన్‌లో ఆవులు, ఎద్దులు 1,06717, గేదెలు 23,082 ఉన్నాయి. ప్రధానంగా గ్రామాల్లో రైతులు వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా పాడి పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇందుకోసం వేలాది రూపాయలు వెచ్చించి పాడి పశువులను కొనుగోలు చేస్తున్నారు. కొన్నిసార్లు పాడి పశువులు వ్యాధులతో మరణించి పాడి రైతులు జీవనోపాధిని కోల్పోతున్నారు. ఈనేపథ్యంలో పశువంవర్ధ శాఖ అధికారులు వ్యాధుల నివారణకు టీకా కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ ప్రారంభించారు.

గాలికుంటు లక్షణాలు..

పాడి ఆవులు, గేదెలకు తీవ్రమైన జ్వరం రావడం, నోటి నుంచి విపరీతమైన చొంగ కారడం, నోటి లోపల పుండ్లు ఏర్పడి మేత మేయని పరిస్థితి ఎదుర్కొంటాయి. దీనికితోడు కాలి గిట్టల మధ్య పుండ్లు, గాయాలు ఏర్పడి పశువులు నడవలేని ఇబ్బంది పడతాయి. చూడి పశువులు బలహీనంగా మారతాయి. ఇక పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. పాలు తాగే దూడలు కూడా మరణిస్తాయి. ఎండలో పాడి పశువులు కనీసం కూడా ముందుకు నడవకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే నిర్లక్ష్యం చేస్తే పశువులు మృత్యువాత పడే అవకాశాలున్నాయి.

టీకాలతో ప్రయోజనం



గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు తప్పక వేయించాలి. దీని వల్ల అవి ఆరోగ్యకరంగా ఉంటాయి. పశువులు చనిపోయే అవకాశం ఉండదు. పాల ఉత్పత్తి తగ్గకుండా, పాడి ఆవులు, గేదెలు తగిన బలాన్ని సంతరించుకుంటాయి.

– గిరిజ, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, పెనుకొండ

స్పెషల్ డ్రైవ్



రోజూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గాలికుంటు టీకాలు అందిస్తున్నాం. ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకూ వ్యాక్సినేషన్ కొనసాగుతుంది. పశువుల పెంపకందారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రధానంగా పశువులు మరణించకుండా ముందుజాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలి.

– శ్రీరాములు నాయక్, ఏడీ, పశుసంవర్ధకశాఖ

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న కార్మికులు

పెనుకొండ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నేత బాబావలి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు చిన్నవెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్మికులు నగర పంచాయితీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఒప్పంద కార్మికులకు జీతాలు పెంచాలని, సమ్మె కాలానికి జీతాలు చెల్లించాలన్నారు. నాయకులు నాగరాజు, మహబూబ్‌బాషా, నరసింహ, ఆనంద్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెనుకొండ: పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రతాప్ పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రపరచడమే కాక, పిచ్చిమొక్కలు తొలగించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరీష్‌బాబు, రామన్న, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి



మాట్లాడుతున్న నాయకులు శివరామకృష్ణ

పెనుకొండ: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని దళిత బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్ట్ న్యాయవాది శివరామకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఆయన వేదిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆర్డీటీ సంస్థ దశాబ్దాలుగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల కోసం ఎనలేని సేవలు అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయకున్నా సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 20న పెనుకొండలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. వేదిక నాయకులు బాబు, కదిరప్ప, నరసింహులు, రవి, రామాంజినేయులు, కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు డే ఫాగింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు.ఆయన గురువారం మున్సిపల్ చైర్మన్ నరసింహరాజుతో కలిసి డే ఫాగింగ్ చేయించారు. ఆయన మాట్లాడుతూ కల్వర్టుల కింద ఫాగింగ్ చేయడం వల్ల దోమల లార్వాలు అంతరించిపోతుందన్నారు. మురికి నీటిలో ఆయిల్ బాల్స్ వేసి దోమలను నివారిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా ఫాగింగ్ చేస్తున్నామన్నారు. కౌన్సిలర్లు ఉమాశంకర్,నాగేంద్ర,మైనార్టీ కార్పొరేషన డైరెక్టర్ భక్తర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు నెలల క్రితం ప్రమాదం.. చికిత్స పొందుతూ మృతి



శ్రీనివాసమూర్తి (ఫైల్)

హిందూపురం: స్థానిక ప్రభాత్ మెడికల్ స్టోర్ యజమాని శ్రీనివాసమూర్తి (73) బెంగళూరులో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న శ్రీనివాసమూర్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద నాగులు నెలల క్రితం ఆవు అడ్డుగా వచ్చి తగలడంతో కిందపడి, గాయపడ్డాడు. దీర్ఘకాలికంగా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చెరువు ప్రారంభోత్సవం

పావగడ: తాలూకా లోని లింగదహళ్లి పంచాయతీ పరిధిలోని పోలేనహళ్లిలో స్థానిక శ్రీ క్షేత్ర ధర్మ స్థల గ్రామాభివృద్ధి యోజన ఆధ్వర్యంలో మన ఊరు–మన చెరువు పథకం కింద పూడిక తీసిన చెరువును గురువారం ప్రారంభించారు. జిల్లా ధర్మ స్థల సంఘం డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి చెరువుల్లో పూడిక తీసి వర్షపు నీరు చేరేలా చర్యలు చేపట్టి గ్రామస్తులకు అప్పగించామన్నారు.

19 నుంచి పెన్‌డౌన్

చిలమత్తూరు: ఈ నెల 19 నుంచి రెండు రోజుల పాటు డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండార్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పెన్‌డౌన్ చేయనున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు పవన్ కుమార్ మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నూతనంగా ప్రవేశపెట్టిన ఓటీపీ విధానం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని, రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు ఓటీపీ లు చెప్పడానికి భయపడుతున్నారన్నారు. కొన్ని సార్లు ఓటీపీలు రాకపోవడంతో పనులు ఆలస్యం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని రద్దు పరచాలని వారు డిమాండ్ చేశారు. 19, 20న పెన్‌డౌన్ చేస్తున్నట్లు తెలిపారు.

కౌలు ఒప్పందం రద్దు చేసుకునే స్వేచ్ఛ కల్పించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మడకశిరరూరల్: మండలంలోని వివిధ పంచాయతీల్లో సోలార్ ప్రాజెక్టుకు భూములిచ్చే రైతులకు కౌలు ఒప్పందం రద్దు చేసుకునే స్వేచ్ఛ కల్పించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన వివిధ సంఘాల నాయకులతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఆర్.అనంతపురం, గౌడనహళ్లి, ఛత్రం పంచాయతీల్లో సేకరించిన ఏపీఐఐసీ సెజ్ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయని భూములను 2013 భూసేకరణ చట్టం ప్రకారం తిరిగి రైతులకు ఇవ్వాలన్నారు. హరేసముద్రం, మణూరు, బుళ్లసముద్రం, వైబీహళ్లి పంచాయతీల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం రైతుల భూములను సేకరిస్తున్నారన్నారు. ఎకరాకు ఏడాదికి రూ.30 వేలు కౌలు ఇచ్చి, వారు ఏడాదికి రూ. 80 లక్షల వరకు లాభం పొందే ఆలోచనలో ఉన్నారని రైతులకు వివరించారు. ప్రతి రెండేళ్లకు ఒక సారి 20 శాతం కౌలు పెంచాలన్నారు. అగ్రిమెంట్ కాల పరిమితి 10 ఏళ్లు మించకుండా భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ కాకుండా జెరాక్స్ కాఫీలు మాత్రమే తీసుకోవాలన్నారు. ఎకరాకు ఏడాదికి రూ.50 వేలు తగ్గకుండా ఇవ్వాలన్నారు. భూములు కోల్పోయే రైతులకు సోలార్ కంపెనీ నుంచి ప్రభుత్వం చట్ట బద్ధమైన రక్షణ కల్పించాలని కోరుతూ 24న విజయవాడలో నిర్వహించే మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని గ్రామాల్లో రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. జిల్లా రైతు, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు వేమారెడ్డి, రామాంజనేయులు,మోగానంద్, రవి, ముత్యాలు ఈరేష్ పాల్గొన్నారు.

ఆర్‌డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సు పునరుద్ధరించండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హిందూపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆర్‌డీటీకు ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని ప్రజా సంఘాల, రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌డీటీని కాపాడుకునేందుకు ఈ నెల 22న ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలకు వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ర్యాలీలో ఆర్డీటీ సేవలు పొందిన ప్రతి ఒక్కరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఐక్యవేదిక అధ్యక్షుడు శ్యామ్ కిరణ్, యూటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీఎస్పీ పార్టీ శ్రీరాములు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షుడు రవికుమార్, జైభారత్ భీమ్ రావు పార్టీ నాయకులు నాగరాజు, సమాజ్ వాది పార్టీ తౌసిఫ్, హరికుమార్, నారాయణ, కలీం, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' వైద్య సేవలు



సింగేపల్లిలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని సింగేపల్లి, చందకచెర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ వైద్య సేవలు నిర్వహించారు. వైద్యులు మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఆరోగ్యం పట్ల మహిళలు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలావతి, డాక్టర్ వినోద్‌కుమార్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగళి: మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష అని వైద్యులు శివానంద, చిదానంద అన్నారు. మండలంలోని ఇనగలూరు ఉప ప్రాథమిక కేంద్రం వద్ద స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సర్పంచ్ మంజుల, ఎంపీహెచ్ఏ సుందర్య, శోభారాణి వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పరిగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 14న కదిరి ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పరిగి జెడ్పీ స్కూల్ విద్యార్థినులు హర్షవల్లి, మంజుల, గంగమ్మ, బాలుర విభాగం యశ్వంత్ ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారితో ఎస్ఓ రమాదేవి, పీఈటీ అశ్విని

పరిగి: ఈనెల 17న అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 19 విభాగంలో విద్యార్థినులు హేమ, నిహారిక, లాస్యప్రియ, అండర్ 17లో సరస్వతి, ప్రేమశ్రీ, అండర్ 14లో చరిత అనే విద్యార్థినులు ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో విద్యార్థినులను ఎస్ఓ రమాదేవి, పీఈటీ అశ్విని అభినందించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: కురుబవాండ్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత చెన్నకేశవులు భార్య లక్ష్మీదేవి అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ గ్రామానికి చేరుకుని లక్ష్మీదేవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇదిలా ఉండగా చిన్నపరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ వెంకటేష్ కుమారుడు బోయ మారుతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఉషశ్రీచరణ్ గ్రామానికి చేరుకుని వెంకటేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్ రెడ్డి, నాయకులు ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణస్వామి, కొండలరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల ధర్నా



పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతన్న వీఆర్ఏలు

పెనుకొండ రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలన కోరుతూ వీఆర్ఏలు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం నాయకులు మాట్లాడుతు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్,వీఆర్ఏల జిల్లా సంఘం జిల్లా నాయకులు నరసప్ప, అంజనప్ప, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సోమందేపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు గురువారం తహసీల్దార్ మారుతికు వారు వినతిపత్రం అందజేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలు నాగార్జున, రమేష్, విజయ్, గంగప్ప, మదు, అంజి తదితరులు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజీ' విజయవంతం చేయండి

మడకశిర: రాష్ట్రంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ యువజన,విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నితిన్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ గురువారం వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం చలో పెనుకొండ మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం దిగివచ్చే వరకూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తామన్నారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని చలో పెనుకొండ మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అమరాపురం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చలో పెనుకొండ మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు కోరారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పెనుకొండలోని మెడికల్ కళాశాల భవన నిర్మాణం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గం నుంచి యువకులు తరలి రావాలని ఆయన కోరారు.

మొబైల్ అతిగా ఉపయోగించకండి



మాట్లాడుతున్న మురళీధర్

పావగడ: మొబైల్ ఫోన్ అతిగా వాడితే మానసిక రోగానికి గురవడంతో పాటు జీవితం నాశనం అవుతుందని వైఈఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.ఎస్. మురళీధర్ సూచించారు. స్థానిక కళాశాల ఆవరణలో ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'మొబైల్ వదలండి.. పుస్తకం పట్టండి' అనే అంశంపై ఆయన మా ట్లాడారు. విద్యార్థులు పుస్తక ప్రేమను అలవరచు కోవాలన్నారు. ఆలూరయ్య మాట్లాడుతూ వాహనాలు నడుపుతూ మొబైల్ వాడడం అపాయకరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి 'సీబీ హార్నెట్ 125, షైన్ 100 డీఎక్స్'



వాహనాలను ప్రారంభిస్తున్న షోరూం యజమాని ప్రసాద్‌రెడ్డి

హిందూపురం: స్థానిక ప్రీమియం హోండా షోరూంలో సీబీ హార్నెట్ 125, షైన్ 100 డీఎక్స్ వాహనాలను షోరూం యాజమాని ప్రసాద్ రెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. జీఎస్‌టీ తగ్గింపు ధరలతో నమ్మకమైన విశ్వాస పాత్రమైన హోండా ద్విచక్ర వాహనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, హోండా కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ ప్రజ్వాల్, రాంప్రసాద్, హిందూపురం టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రఫీక్, రహమతుల్లా, బసవరాజు, షోరూం సబ్ డీలర్లు మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా ప్రీమియం చెల్లింపు

లేపాక్షి: మండలంలో వర్కింగ్ జర్నలిస్టులందరికీ లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తపాలా ప్రమాద బీమా ప్రీమియం గురువారం చెల్లించారు. ఏడాది కాలపరిమితికి ఒక్కో జర్నలిస్ట్‌కు రూ.749 చొప్పున తపాలా ప్రమాద బీమా ప్రీమియం చెల్లించారు. ఏదైనా ప్రమాదం జరిగినా, అంగవైకల్యం, కంటి చూపు మందగించినా రూ.15 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని తపాలా సిబ్బంది తెలిపారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండలంలోని ఫళారదహట్టికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధలింగప్ప (60) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. అలాగే స్థానిక సర్పంచ్ సతీష్, మందలపల్లి సర్పంచ్ అశ్వత్థకుమార్, నాయకులు చంద్రప్ప, తిమ్మన్న, సిద్ధలింగప్ప, జగదీష్, ఈరన్న తదితరులు నివాళులర్పించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షులు హరి

మడకశిరరూరల్: బుక్కపట్నం వెలుగు కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్‌పై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హరి డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ గురువారం గౌడనహళ్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు సంబంధించి రూ.ఎనిమిది లక్షల నిధులు అవినీతి జరిగిందని ప్రశ్నించడానికి వెళ్లిన సీపీఎం నాయకులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కేవీపీఎస్ సభ్యులు రామాంజనేయులు, రవి, ముత్యాలు, జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు వీరేష్, రైతు సంఘం సభ్యుడు వేమారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



ఆర్ఐకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

రొళ్ల: సుప్రీం కోర్టు తీర్పును అనుసరిస్తూ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని ఆర్ఐ గిరియప్పకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ ఉప కులాలుగా విభజించి ఆయా కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యమ కారులు యరగుంటప్ప, గోవిందప్ప, పునీత్‌కుమార్, అంజి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రొద్దం: లక్కానిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై ఎస్ఐ నరేంద్ర గురువారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.14,500 నగదు, ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన 8 మందితో కలిపి మొత్తం 14 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముస్తాబవుతున్న లేపాక్షి ఆలయం



ఆలయ ఆవరణలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని శుద్ధి చేశారు. ఆలయ ప్రాంగణం అంతా నీటితో శుభ్రం చేసి శిల్పాలు, చిత్రలేఖనాలను శుభ్రం చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్, ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు నిబంధనలు పాటించాలి

రొళ్ల: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ వీరాంజనేయులు సూచించారు. గురువారం మండలంలోని రొళ్లకొండ గ్రామ సమీపాన 544ఈ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహన యజమానులకు జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానిస్టేబుల్ షఫీవుల్లా, హోం గార్డు రంగప్ప పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

రొద్దం: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయానికి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ బకాయిలను వసూలు చేయాలని గ్రంథాలయాధికారి నాగరాజుకు సూచించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

పెనుకొండ:బుక్కపట్నం వెలుగు కార్యాలయంలో రూ. 8 లక్షలు అవినీతి జరిగిందని ప్రశ్నించడానికి వెళ్లిన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నేత బాబావలి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దాడి చేసిన సీసీ రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజుపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు నాగరాజు, వెంకటేష్, ఆనంద్ పాల్గొన్నారు.

పోషణ్ మాసోత్సవం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి-3 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఉదయం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషణ, ఆరోగ్యంపై చర్చించారు. కార్యక్రమం అక్టోబర్ 18 వరకు నిర్వహించాలన్నారు.

ఘనంగా మోదీ పుట్టినరోజు

పావగడ: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తుమకూరు రోడ్డు లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో 76 మంది కార్యకర్తలు, అభిమానులు రక్త దానం చేశారు. తాలూకా బీజేపీ అధ్యక్షుడు డీఆర్ అశోక్, సీనియర్ నాయకులు డా జీ వెంకట్రామయ్య, రవి పాల్గొన్నారు.

87.2 మి.మీ వర్షపాతం నమోదు

చిలమత్తూరు: మండలంలో బుధవారం రాత్రి ఎడతెరపి లేని భారీ వర్షం కురిసింది. 87.2 మి.మీ వర్షపాతం రికార్డు స్థాయిలో నమోదయ్యింది. పలు చోట్ల పంటలు నీట మునిగాయి. అర్ధరాత్రి సమయాల్లో వర్షం ప్రారంభమవుతుండగా, తెల్లవారే వరకూ ఎడతెరపి లేకుండా కురుకురిసింది.